క్లుప్తంగా

ఆలయంలో సప్తాహ అఖండ భజన



భజన చేస్తున్న కళాకారులు

యైటింక్లయిన్‌కాలనీ: రామగుండం కార్పొరేషన్ 19వ డివిజన్ న్యూమారేడుపాక గ్రామంలోని శ్రీలక్ష్మీనృసింహస్వామి కల్యాణ వేడుకల్లో భాగంగా శుక్రవారం ఆలయంలో సప్తాహ, అఖండ భజన కార్యక్రమం నిర్వహించారు. ఉదయం స్వామివారికి పంచామృతాలతో అభిషేకాలు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు భక్తులకు తీర్థప్రసాద వితరణ చేశారు. ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

సమస్యలపై సమాచారం ఇవ్వండి

మంథని: మున్సిపల్ పరిధిలోని వార్డుల్లో పారిశుధ్య నిర్వహణ, మంచినీటి సరఫరా, వీధిదీపాలు, ఇతరత్రా సమస్యలు ఏమున్నా వార్డు ఆఫీసర్లకు సమాచారం అందిస్తే పరిష్కరిస్తామని మున్సిపల్ కమిషనర్ మనోహర్ శుక్రవారం తెలిపారు. 13 వార్డులకు అధికారులు ఉన్నారని, ప్రజలు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

'గాయత్రీ' విద్యార్థినికి ఇన్‌స్పైర్ అవార్డు



అవార్డు అందుకుంటున్న అమీమా తహ్రీం

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లిలోని గాయత్రీ విద్యానికేతన్‌కు చెందిన 9వ తరగతి విద్యార్థిని అమీమా తహ్రీం ఇన్‌స్పైర్ అవార్డుకు ఎంపికైనట్లు విద్యాసంస్థల చైర్మన్ అల్లెంకి శ్రీనివాస్ తెలిపారు. పోటీలో రోడ్డు ప్రమాదాల ముందస్తు నివారణ అనే అంశంపై చేసిన ప్రయోగానికి ఈ అవార్డు లభించిందని పేర్కొన్నారు. విద్యార్థినికి జిల్లా సైన్స్ అధికారి రవినందన్‌రావు సర్టిఫికెట్ ప్రదానం చేశారు. సర్టిఫికెట్‌తో పాటు రూ.10వేల నగదు బహుమతి సాధించిందని తెలిపారు. కరస్పాండెంట్ రజనీ, ప్రిన్సిపాల్ విజయ్, గైడ్ టీచర్ సదానందం, శరణ్య, రజియుద్దిన్ ఉన్నారు.

టోకెన్ సమ్మె విజయవంతం



మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నాయకుడు కౌశిక్ హరి, పక్కన అంబటి నరేశ్

ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం ఫెర్టిలైజర్స్ కెమికల్ లిమిటెడ్ కర్మాగారంలో కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలనే డిమాండ్‌తో శుక్రవారం చేపట్టిన టోకెన్ సమ్మె విజయవంతమైందని ఆర్‌ఎఫ్‌సీఎల్ మజ్దూర్ యూనియన్ నాయకుడు అంబటి నరేశ్ తెలిపారు. కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలు పెంచాలని, ఇన్సెంటివ్ చెల్లించడంతోపాటు సౌకర్యాలు కల్పించాలని ఆర్‌ఎల్‌సీలో ఫిర్యాదు చేసి రెండేళ్లు గడిచినా పట్టించుకోవడంలేదని పేర్కొన్నారు. మొదటి షిఫ్ట్, జనరల్ షిఫ్ట్ కార్మికులు స్వచ్ఛందంగా విధులు బహిష్కరించి సమ్మెకు మద్దతుగా నిలిచారని అన్నారు. కాగా, ఎన్టీపీసీ ఎస్సై ఉదయ్ కిరణ్ కాంట్రాక్ట్ కార్మికులు, యూనియన్ నాయకులతో చర్చించారు. నాయకులు కొండ్ర రూపేశ్, ఎండీ సలీం, కల్లపెల్లి దేవయ్య, మారం తిరుపతి, మేకా కరుణాకర్, జంగం కృష్ణ, గజబింకర్ రమేశ్, మేకా క్రాంతి, మర్రి శ్రావణ్, రావుల సురేశ్ తదితరులు పాల్గొన్నారు. కాగా టోకెన్ సమ్మెలో పాల్గొన్న కాంట్రాక్టు కార్మికులకు బీఆర్‌ఎస్ నాయకుడు కౌశిక హరి మద్దతు తెలిపారు. ఆయన మాట్లాడుతూ, కార్మికులు చేసే పనికి, చెల్లించే వేతన విధానానికి సంబంధం లేదన్నారు. కాంట్రాక్టు కార్మికుల న్యాయమైన డిమాండ్లను యాజమాన్యం చర్చించి పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు.

ప్లకార్డులతో నిరసన

జ్యోతినగర్: జగిత్యాల జిల్లా వడ్డెలింగాపూర్ గ్రామంలో విధుల నిర్వహణ అనంతరం ఇంటికి వెళ్తున్న దళిత మహిళ, ఆశావర్కర్‌పై అత్యాచారం చేసిన వ్యక్తిని కఠినంగా శిక్షించడంతోపాటు మహిళకు న్యాయం చేయాలని సీఐటీయూ ఆధ్వర్యంలో ఎన్టీపీసీలో శుక్రవారం నిరసన ప్రదర్శన చేపట్టారు. నిందితులను ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కఠినంగా శిక్షించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు ఎస్.బిక్షపతి, గీట్ల లక్ష్మారెడ్డి డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి రూ.50 లక్షల పరిహారం చెల్లించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పోలీసు యంత్రాంగం తగిన చర్యలు చేపట్టాలని కోరారు. నాయకులు మల్లేశ్, సునీత, లక్ష్మణ్, లక్ష్మయ్య, రాణి, దేవమ్మ పాల్గొన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభాలు

- శిథిలావస్థకు చేరిన వైనం.. కిందికి వేలాడుతున్న తీగలు
- కొత్త స్తంభాలు ఏర్పాటు చేయాలని మండల ప్రజల వినతి



గుండారంలో ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం

కమాన్‌పూర్: మండల పరిధిలో ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాలు పూర్తిగా శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారాయి. గ్రామాల్లోని రహదారుల వెంట ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాలకు ఏర్పాటు చేసిన విద్యుత్ తీగలు కిందికి వేలాడుతున్నాయి. గ్రామంలో సీసీరోడ్లు, మురుగునీటి కాల్వల నిర్మాణాలు చేపట్టడంతో రహదారుల ఎత్తు సుమారు మీటరు నుంచి రెండు మీటర్ల వరకు ఎత్తు పెరిగాయి. దీంతో విద్యుత్ స్తంభాలు మట్టిలో కూరుకుపోవడంతో పాటు విద్యుత్ వైర్లు కిందికి వేలాడుతుండంతో రహదారి వెంట వెళ్లే వాహనాలకు తాకి ప్రమాదాలు జరిగే ప్రమాదం పొంచి ఉంది.

ప్రమాదమని తెలిసినా పట్టించుకోరా..

మండలంలోని తొమ్మిది గ్రామపంచాయతీల పరిధిలో గతంలో ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాలు పూర్తిగా శిథిలావస్థకు చేరినా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. కేవలం ప్రధాన రహదారుల వెంట ఉన్న విద్యుత్ స్తంభాలు, విద్యుత్ తీగలు మాత్రమే మారుస్తున్నారని గానీ గ్రామాల్లో ప్రమాదంగా ఉన్న వాటిని పట్టించుకోవం లేదని ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

పట్టించుకోవడం లేదు



గుండారంలో ఉన్న చాలా విద్యుత్ స్తంభాలు ప్రమాదకరంగా మారాయి. విద్యుత్ తీగలు కిందికి వేలాడుతున్నాయి. వాహనాలు వాటికి తాకితే ప్రమాదం జరిగే అవకాశం ఉంది. ఎలాంటి ప్రమాదం జరగకముందే ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభాలు తొలగించి కొత్త స్తంభాలు ఏర్పాటు చేయాలి. – సంతోష్, గుండారం

కొత్త స్తంభాలు ఏర్పాటు చేస్తాం



మండల పరిధిలోని గ్రామాల్లో ప్రమాదంగా ఉన్న విద్యుత్ స్తంభాలను సిబ్బందితో గుర్తించి వాటి స్థానంలో కొత్త విద్యుత్ స్తంబాలను ఏర్పాటు చేయిస్తాం. గ్రామాల్లో విద్యుత్ సమస్యలుంటే సిబ్బంది తెలిపి పరిష్కరించుకోవాలి. – అశోక్, ట్రాన్స్‌కో ఏఈ, కమాన్‌పూర్

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు



కందుల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న విప్ లక్ష్మణ్‌కుమార్

ధర్మారం: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను దశలవారీగా అమలు చేస్తోందని ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్ అన్నారు. బంజేరుపల్లి ఎస్సీకాలనీకి మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు శుక్రవారం ఆయన ముగ్గుపోసి పనులు ప్రారంభించారు. అనంతరం ధర్మారం వ్యవసాయ మార్కెట్ యార్డులో కందుల కొనుగోలు కేంద్రాన్ని చైర్మన్ రూప్లానాయక్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా విప్ మాట్లాడుతూ అర్హులైన ప్రతీ కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తామన్నారు. ఇళ్ల నిర్మాణానికి నీటి సమస్య తలెత్తకుండా ఏసీడీపీ నిధుల ద్వారా మూడు రోజుల్లో బోరింగ్ వేయిస్తామని ఆయన హామీ ఇచ్చారు. మాజీమంత్రి కొప్పుల ఈశ్వర్ తన హయాంలో ఈప్రాంత అభివృద్ధికి కృషి చేయకుండా తనపై నిందలు మోపడం సరికాదన్నారు. ఇక్కడ వేలాది ఎకరాలను ప్రాజెక్టులకు తీసుకుని సాగునీటిని సిద్దిపేట, సిరిసిల్ల, గజ్వేల్ ప్రాంతాలకు తరలిస్తుంటే ప్రశ్నించని ఆయన.. తనపై ఆరోపణలు చేయడం సిగ్గుచేటన్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్ లావుడ్య రూప్లానాయక్, వైస్ చైర్మన్ అరిగే లింగయ్య, నాయకులు కొత్త నర్సింహులు, పాలకుర్తి రాజేశంగౌడ్, కొడారి హన్మయ్య, యశోద అజయ్, గాగిరెడ్డి తిరుపతిరెడ్డి, తిరుపతి, గంగారెడ్డి, తహసీల్దార్ వకీల్, ఎంపీడీవో ప్రేమ్‌కుమార్, ఎంపీవో రమేశ్ పాల్గొన్నారు.

సుందర నగరంగా తీర్చిదిద్దేందుకు సహకరించండి



మాట్లాడుతున్న వెంకటస్వామి

జ్యోతినగర్: రామగుండం మున్సిపల్ కార్పొరేషన్‌ను సుందర నగరంగా తీర్చిదిద్దేందుకు అందరూ సహకరించాలని నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ వెంకటస్వామి కోరారు. కార్పొరేషన్ ప్రాంతంలోని ఎన్టీపీసీ రామగుండం మేడిపల్లి సెంటర్ ఏరియాలో శుక్రవారం స్వచ్ఛ సర్వేక్షణ్–2025లో రామగుండం నగరం మెరుగైన ర్యాంక్ సాధించేందుకు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో భాగంగా రామగుండం కార్పొరేషన్, మెప్మా సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇళ్లలో వెలువడిన చెత్త బయట వేయకుండా మున్సిపల్ వాహనాలకు అందించి సహకరించాలని సూచించారు. ఇంటి వద్దనే తడి చెత్త, పొడి చెత్త వేరు చేయాలన్నారు. హోమ్ కంపోస్టింగ్ విధానంలో తడి చెత్త నుంచి ఎరువు తయారు చేసుకొని మొక్కల పోషణకు ఉపయోగించుకోవాలన్నారు. పొడి చెత్తను మున్సిపల్ వాహనాలకు అందిస్తే డ్రై రీసోర్స్ సెంటర్, డంపింగ్ యార్డుకు తరలిస్తారని పేర్కొన్నారు. డివిజన్‌లోని ప్రజలకు స్వచ్ఛ భారత్‌పై అవగాహన కల్పించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాగభూషణం, వార్డు అధికారులు మహేందర్, అభినవ్, శ్యామ్‌కుమార్, అజయ్‌కుమార్, ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ మధుకర్, ఎంఐఎస్ ఆపరేటర్ శ్రీకాంత్, మెప్మా ఆర్పీలు పాల్గొన్నారు.

రాష్ట్రపతిభవన్‌లో రాఘవాపూర్ ఒగ్గుడోలు ప్రదర్శన



రాష్ట్రపతి భవన్‌లో ఒగ్గుడోలు కళాకారులు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం రాఘవాపూర్‌కు చెందిన ఒగ్గుడోలు కళాకారుల బృందం శుక్రవారం ఢిల్లీలోని రాష్ట్రపతిభవన్‌లో నిర్వహించిన ఉత్సవాల్లో ప్రదర్శనలిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం భాషాసంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో ఒగ్గుడోలు ప్రదర్శనలిచ్చేందుకు రాఘవాపూర్‌కు చెందిన కుంట సదయ్య కళాబృందానికి అవకాశం కల్పించారు. సదయ్య బృందం సభ్యులు కళానైపుణ్యంతో ఇచ్చిన ప్రదర్శనలు అలరించాయి. మూడురోజుల పాటు జరిగే కార్యక్రమాల్లో తమ బృందం సభ్యులు రాజ్‌కుమార్, సదయ్య, రమేశ్ పాల్గొంటారని తెలిపారు.

ముందస్తుగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం



ఫెర్టిలైజర్‌సిటీ: ఎంఈవోకు సన్మానం



కోల్‌సిటీ: సత్కరిస్తున్న ప్రతినిధులు

ఫెర్టిలైజర్‌సిటీ: పాలకుర్తి మండలం ఎల్కలపల్లి మండల పరిషత్ పాఠశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం పాలకుర్తి మండల విద్యాధికారి విమలను విద్యార్థులు సన్మానించారు. గ్రామంలో పనిచేస్తున్న మహిళా ఉద్యోగులను, కార్యదర్శి రమ్య, అంగన్వాడీ కార్యకర్తలు, మహిళా ఉపాధ్యాయులను సత్కరించారు.

పారిశుధ్య కార్మికులకు సత్కారం

కోల్‌సిటీ: రామగుండం నగరపాలక సంస్థకు చెందిన 100 మంది మహిళా పారిశుధ్య కార్మికులను సత్కరించారు. శుక్రవారం స్థానిక 33వ డివిజన్‌లో, మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఫైట్ ఫర్ బెటర్ సొసైటీ అధ్యక్షుడు మద్దెల దినేశ్ ఆధ్వర్యంలో, రామగుండం మెడికల్ కాలేజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ శిరీష చేతుల మీదుగా సత్కరించి, జ్ఞాపిక అందజేశారు.



కమాన్‌పూర్: ఉపాధ్యాయులకు సన్మానం

మహిళలకు సన్మానం

కమాన్‌పూర్: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలోని రొంపికుంట, ముల్కలపల్లి ప్రభుత్వ పాఠశాలలో ఉని చేస్తున్న మహిళా ఉపాధ్యాయులు, వంట సిబ్బంది, స్కావెంజర్లను శుక్రవారం సన్మానించారు.

పార్కింగ్ ఫీజు రద్దు చేయాలి



సాక్షి కథనాన్ని జోడించి ఎక్స్‌లో ఫిర్యాదు చేసిన దినేశ్

రామగుండం: స్థానిక రైల్వే స్టేషన్ ప్రాంగణంలో ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చే ఆటోవాలాలపై పార్కింగ్ ఫీజు వసూలుకు రైల్వేశాఖ శ్రీకారం చుట్టింది. ఈ నేప్యంలో సాక్షి దినపత్రికలో ఈనెల 3వ తేదీన 'ఆటోవాలాలపై రైల్వే పార్కింగ్ భారం' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీంతో సామాజిక కార్యకర్త మద్దెల దినేశ్ 'సాక్షి'లో ప్రచురితమైన కథనాన్ని జోడిస్తూ రైల్వే పార్కింగ్ ఫీజు వసూలు నిర్ణయాన్ని రద్దు చేయాలని కోరారు. ఈమేరకు రైల్వేశాఖ మంత్రి, దక్షిణ మధ్య రైల్వే జీఎం, దక్షిణ మధ్య రైల్వే డివిజనల్ మేనేజర్లకు 'ఎక్స్'లో ఫిర్యాదు చేశారు.

సంక్షిప్త వార్తలు

• నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మంథని: విద్యుత్ ఉప కేంద్రం మరమ్మతు పనుల దృష్ట్యా మంథని, గుంజపడుగు, నాగారంలో శనివారం ఉదయం 8 గంటల నుంచి 10 వరకు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ రాజేశ్ తెలిపారు.

• కమాన్‌పూర్ మండలంలో..

కమాన్‌పూర్: కమాన్‌పూర్, రొంపికుంట విద్యుత్ సబ్‌స్టేషన్లలో చేపడుతున్న మరమ్మతు పనుల నేపథ్యంలో శనివారం ఉదయం 9గంటల నుంచి 10:30 వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ అశోక్ తెలిపారు. మండల కేంద్రంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాట్లు చేస్తున్న ఎస్‌బీఐ బ్యాంకు మెయిన్ రోడ్డు, డాక్టర్ విజయ్‌కుమార్ లైన్ ఏరియాలో మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.

• పాలకుర్తి మండలంలో..

పాలకుర్తి: మండలంలోని బసంత్‌నగర్, పుట్నూర్ గ్రామ విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాలకు శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు బసంత్‌నగర్ సెక్షన్ ఏఈ ప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నెలవారీ మరమ్మతు పనుల దృష్ట్యా ఉదయం 8గంటల నుంచి 10 వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

• కూలీ సమస్యల పరిష్కారానికి కృషి

పాలకుర్తి: మండలంలోని ఈసాలతక్కళ్లపల్లిలో ఉపాధిహామీ పనులు నిర్వహిస్తున్న కూలీలను శుక్రవారం రామగుండం ఎమ్మెల్యే సతీమణి మనాలీఠాకూర్ కలిశారు. కూలీలు ఎదుర్కొంటున్న సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

• అదుపు తప్పి కారు బోల్తా

పెద్దపల్లిరూరల్: పట్టణ శివారు రంగంపల్లి సమీపంలో శుక్రవారం కారు అదుపు తప్పి రాజీవ్‌రోడ్డుపై నుంచి కాలువలోకి దూసుకెళ్లింది. గోదావరిఖని యైటింక్లయిన్‌కాలనీకి చెందిన వ్యక్తికి చెందిన కారుగా గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. ప్రమాదంలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదు.

• ఆర్థికసాయం అందజేత

కమాన్‌పూర్: మండలంలోని జూలపల్లికి చెందిన బొడ్డుపల్లి రాయమల్లు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. కాగా మృతుడి కుటుంబానికి యూత్ కాంగ్రెస్ నాయకులు శుక్రవారం రూ.36వేలు అందజేశారు. కార్యక్రమంలో జెమినిగౌడ్, రెబల్ రాజ్‌కుమార్, గడ్డం మధునయ్య, సందీప్‌గౌడ్, ఆకుల శశి, గడ్డం రాజమహేందర్, మారుతిగౌడ్, సందవేన నాగరాజు పాల్గొన్నారు.

• డీజే సౌండ్ నిర్వాహకుల బైండోవర్

రామగిరి: ఆయా గ్రామాలకు చెందిన పలువురు డీజే సౌండ్ నిర్వాహకులను శుక్రవారం తహసీల్దార్ సుమన్ ఎదుట బైండోవర్ చేసినట్లు ఎస్సై చంద్రకుమార్ తెలిపారు. ప్రస్తుతం నడుస్తున్న ఇంటర్ పరీక్షలు, రానున్న పదో తరగతి పరీక్షలను దృష్టిలో పెట్టుకుని విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తకుండదని పోలీసుస్టేషన్‌లో కౌన్సెలింగ్ నిర్వహించారు. చట్టవిరుద్ధంగా డీజే సౌండ్స్ ఉపయోగిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుని డీజేలు సీజ్ చేస్తామన్నారు.

• తాళం వేసిన ఇంట్లో చోరీ

యైటింక్లయిన్‌కాలనీ: రామగుండం కార్పొరేషన్ యైటింక్లయిన్‌కాలనీలోని తాళం వేసిన సింగరేణి క్వార్టర్‌లో దొంగలు పడ్డారు. పోలీసులు తెలిపిన కథనం ప్రకారం.. టీ2–395లో నివాసం ఉంటున్న కొంపల్లి మధుకర్‌రెడ్డి అనే సింగరేణి కార్మికుడు ఈనెల 5న తన కుటుంబ సభ్యులతో కలిసి బంధువుల పెళ్లికి వెళ్లారు. ఈనెల7న ఇంటికి వచ్చి చూసేసరికి తాళం పగిలి ఉంది. లోనికి వెళ్లి చూడగా బీరువాలోని మూడు తులాల బంగారు ఆభరణాలు, 5 తులాల వెండి, కుంకుమ భరణితోపాటు రూ.10వేల నగదు చోరీకి గురైనట్లు పేర్కొన్నారు. క్లూస్ టీంతో వేలి ముద్రలు సేకరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

• తాటిచెట్టుపై నుంచి పడి గాయాలు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం భోజన్నపేటకు చెందిన బాలసాని రవీందర్ అనే గీత కార్మికుడు శుక్రవారం ప్రమాదవశాత్తు తాటిచెట్టు ఎక్కుతుండగా జారి కిందపడడంతో గాయాలపాలయ్యాడు. స్థానికులు వెంటనే పెద్దపల్లిలోని ఆసుపత్రికి తరలించారు. బాధితుడిని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

శ్రమను దోచుకుంటున్న పాలకులు

పెద్దపల్లిరూరల్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం శ్రామిక మహిళల శ్రమను దోచుకుంటోందని మహిళా సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ జ్యోతి ఆరోపించారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని అన్నిరంగాల్లో పనిచేస్తున్న శ్రామిక మహిళలతో పట్టణంలో శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. మహిళల శ్రమను దోచుకుంటున్నారని, లింగ వివక్ష కొనసాగుతోందని ఆమె అన్నారు. మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలను అరికట్టడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. అంగన్‌వాడీ, ఆశ, మున్సిపల్, పంచాయతీ వర్కర్లకు కనీస వేతనాలను అందించాలని డిమాండ్ చేశారు. పని ప్రదేశాల్లో మహిళలకు రక్షణ కల్పించాలన్నారు. మహిళా సాధికారిత దిశగా చిత్తశుద్ధితో చర్యలు తీసుకోవడం లేదని దుయ్యబట్టారు. కార్యక్రమంలో నాయకులు వనజారాణి, భాగ్యలక్ష్మి, రజిత, రామలక్ష్మి, శారద, సులోచన, అమృత, ముత్యంరావు, రవీందర్, వెంకటస్వామి పాల్గొన్నారు.

సింగరేణి వార్తలు

మహిళలు అన్నిరంగాల్లో ముందుండాలి



మాట్లాడుతున్న వెంకటయ్య



పోటీల్లో పాల్గొన్న మహిళలు

గోదావరిఖని: మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని ఆర్జీ–2 జీఎం బి.వెంకటయ్య పేర్కొన్నారు. జీఎం కార్యాలయంలో శుక్రవారం మహిళా ఉద్యోగులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. అన్ని విభాగాల్లోనూ మహిళలు రాణిస్తున్నారన్నారు. సంస్థలో వచ్చిన అవకాశాలను అందిపుచ్చుకుంటూ ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా పలు పోటీలు నిర్వహించారు. విజేతలకు 12న నిర్వహించే అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా బహుమతులు అందజేస్తామని తెలిపారు. డీజీఎం పర్సనల్ అనిల్‌కుమార్, ఏరియా సెక్యూరిటీ అధికారి షరీఫ్‌మహ్మద్, స్పోర్ట్స్ సూపర్‌వైజర్ నరేందర్‌రెడ్డి, మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు. యైటింక్లయిన్‌కాలనీ ఎన్‌సీవోఏ క్లబ్‌లో సింగరేణి అధికారుల కుటుంబ సభ్యులకు ఆటలపోటీలు నిర్వహించారు. సేవా అధ్యక్షురాలు వనజ, స్పోర్ట్స్ సెక్రటరీ నరేందర్‌రెడ్డి క్లబ్ సెక్రటరీ కల్పన, సభ్యులు సృజన, లత పాల్గొన్నారు.

డబ్బు కన్నా ఆరోగ్యం ముఖ్యం



పరీక్షలు చేస్తున్న వైద్యులు

యైటింక్లయిన్‌కాలనీ: ప్రతీ మనిషికి డబ్బు కన్నా ఆరోగ్యం ఎంతో ముఖ్యమని ఆర్జీ–2 ఏరియా ఎస్‌వోటూ జీఎం రాముడు అన్నారు. సింగరేణి ప్రభావిత గ్రామమైన సింగిరెడ్డిపల్లి గ్రామంలో శుక్రవారం ఆర్జీ–2యాజమాన్యం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. వకీల్‌పల్లి గని ప్రజాభిప్రాయ సేకరణలో భాగంగా ప్రభావిత గ్రామాల ప్రజలకు మౌలిక వసతుల కల్పన కోసం సింగరేణి సంస్థ ఎప్పుడు సామాజిక బాధ్యతగా ముందుంటుందన్నారు. సింగరేణి సంస్థ ఉత్పత్తి ఉత్పాదకతతో పాటు వారి ఆరోగ్యాల కోసం ఉచితంగా వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ప్రజలు, కార్మికులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా వైద్యులు వివిధ రకాల పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. ఏఐటీయూసీ ఆర్జీ–2 బ్రాంచ్ సెక్రటరీ రవీందర్, వైద్యులు మహిపాల్, సింగరేణి ఇతర అధికారులు, పారా మెడికల్ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

కార్మిక సమస్యల పరిష్కారమే లక్ష్యం



మాట్లాడుతున్న ఐఎన్‌టీయూసీ నాయకులు

యైటింక్లయిన్‌కాలనీ: సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఐఎన్‌టీయూసీ యూనియన్ పనిచేస్తుందని యూనియన్ సీనియర్ సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ ధర్మపురి అన్నారు. ఆర్జీ–2 ఏరియా యైటింక్లయిన్‌కాలనీలోని ఐఎన్‌టీయూసీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మికుల కోసం పనిచేస్తున్న ఐఎన్టీయూసీ నాయకులను కొన్ని ఇతర సంఘాల నాయకులు వ్యక్తిగత కక్షలతో దూషించడం మానుకోవాలని కోరారు. ఓసీపీ–3 కార్మికులకు పాత పద్ధతిలోనే షేడేలు కొనసాగించాలని డిమాండ్ చేశారు. 192 మస్టర్లు నిండిన ప్రతీ కార్మికుడికి జనరల్ మజ్దూర్, అలాగే మైనింగ్ స్టాఫ్ కార్మికులకు ప్రమోషన్లు ఇప్పించడం కోసం కృషి చేస్తున్నామని తెలిపారు. కార్మికుల సొంతింటి కల కోసం రాష్ట్ర ప్రభుత్వాన్ని ఒప్పించి వడ్డీలేని రుణాన్ని ఇప్పించేందుకు ఐఎన్‌టీయూసీ కృషి చేస్తుందన్నారు. ఆర్జీ–2 ఐఎన్‌టీయూసీ వైస్ ప్రెసిడెంట్ శంకర్ నాయక్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో రీజినల్ జనరల్ సెక్రటరీ అక్రమ్, సెంట్రల్ జాయింట్ సెక్రటరీ దశరథంగౌడ్, వడ్డేపల్లి దాసు సదానందం, నవీన్‌కుమార్, మార్కండేయ, రవీందర్, రాజయ్య, వెంకట్‌రాజం, రవీందర్‌రెడ్డి, మల్లికార్జున్, మల్లయ్య పాల్గొన్నారు.

ట్రాఫిక్ సిగ్నల్స్ పనిచేసేలా చూడాలి

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం మేడిపల్లి సెంటర్లో ట్రాఫిక్ సిగ్నల్స్ పనిచేసేలా మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలని సీపీఎం రామగుండం ఏరియా కమిటీ జిల్లా నాయకులు ఎం.రామాచారి శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. నిత్యం రద్దీగా ఉండే రాజీవ్ రహదారి మేడిపల్లి సెంటర్‌లో ట్రాఫిక్ సిగ్నల్స్ పని చేయకపోవడంతో పలువురు రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టులో ఉదయం డ్యూటీలకు వెళ్లేవారు, పాఠశాలలకు, కాలేజీలకు వెళ్లేవారు వ్యాపార వర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. అలాగే ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టు రాజీవ్ రహదారి లేబర్ గేట్, బి-గేట్ వద్ద రోడ్డు ప్రమాదాలు తరచూ జరుగుతున్నాయన్నారు. ప్రమాదాలు జరగకుండా ట్రాఫిక్ సిగ్నల్స్ పనిచేసేలా, మున్సిపల్ అధికారులు తగు చర్యలు తీసుకోవాలని ఎన్టీపీసీ గేట్–2 వద్ద బారికేడ్స్ ఏర్పాటు చేయాలని సీపీఎం డిమాండ్ చేస్తోందన్నారు.

క్రీడలతో శారీరక, మానసిక ఉల్లాసం



బహుమతి ప్రదానం చేస్తున్న ఎస్సై చంద్రకుమార్

రామగిరి: క్రీడలతో శారీరక, మానసిక ఉల్లాసం కలుగుతుందని రామగిరి ఎస్సై పెట్టం చంద్రకుమార్ అన్నారు. జేఎన్టీయూ ప్రాంగణంలోని మోక్షగుండం విశ్వేశ్వరయ్య క్రీడా ప్రాంగణంలో శుక్రవారం రెండోరోజు జరుగుతున్న బిజోన్ స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌లో గెలుపొందిన జట్లకు ఆయన బహుమతులు అందజేశారు. వరంగల్ వాగ్దేవి జట్టు సెమీఫైనల్‌కు అర్హత సాధించింది. కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ కృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.